నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, శుక్రవారం 14 మార్చి 2025 | KHAMMAM

# అసెంబ్లీ చరిత్రలో చీకటి రోజు

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ అన్యాయం: వద్దిరాజు, వనమా




ఖమ్మం/ భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ, మార్చి 13: తెలంగాణ అసెంబ్లీ చరిత్రలో గురువారం చీకటి రోజుగా మిగులుతుందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవి చంద్ర, కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. నిండు అసెంబ్లీలో అధికార పార్టీ పట్టపగలే ప్రజాస్వామ్యం గొంతు నొక్కిందన్నారు. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపడం, ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తే సస్పెండ్ చేయడం శోచనీయమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపిన సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని శాసనసభ నుంచి సస్పెండ్ చేయడం విచారకరమని అన్నారు. శాసన సభ్యుడి వివరణ కూడా అడగకుండా సస్పెండ్ చేయడం దుర్మార్గమని అన్నారు. ప్రజల పక్షాన రాజీలేని పోరాటాలు చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సభకు దూరం చేయాలన్న ఉద్దేశంతోనే అధికార పక్షం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేసి ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాల్సిందిగా శాసనసభాపతి ప్రసాద్‌కుమార్‌ను రవిచంద్ర కోరారు.

# ఘనంగా ‘కవిత’ పుట్టిన రోజు వేడుకలు

- హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు చెప్పిన వద్దిరాజు, తాతా మధు
- కేక్ కట్ చేసిన మాజీ ఎమ్మెల్యే వనమా, ఉమ్మడి జిల్లాలో ఉత్సవాలు


ఎమ్మెల్సీ కవితకు బొకే అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ వద్దిరాజు


ఎమ్మెల్సీ కవితకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్సీ తాతా మధు

ఖమ్మం, మార్చి 13: ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురువారం ఘనంగా జరిగాయి. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు తదితరులు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కవిత నివాసంలో ఆమెను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్తగూడెంలో టీబీజీకేఎస్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పాల్గొని కవిత బర్త్‌డే కేక్‌ను కట్ చేసి శ్రేణులకు పంపిణీ చేశారు. అనంతరం కవిత పేరిట మొక్కలు నాటారు. ఆయా నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, జాగృతి బాధ్యులు కేకులు కట్ చేశారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కవితమ్మ ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.


ఎండలోనే ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

# నీడ నీరు లేదు..

పల్లెల్లో వలసలను నివారించి స్థానికంగా పనులు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గొప్ప పథకం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం. ఈ పథకం కింద పనులు జరిగే ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు ప్రభుత్వమే కల్పించాల్సి ఉంది. ఇందుకు నిధులను కూడా కేటాయిస్తుంది. ముఖ్యంగా వేసవి కాలంలో కాసేపు సేద తీరేందుకు టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలి. కానీ అధికారులు ఇవేమీ పట్టించుకోవడం లేదు. కూలీలు చస్తే చస్తారు.. మాకేంటి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. కనీసం ఎండలో పనిచేసి కొద్దిసేపు సేద తీరేందుకు నీడ లేదు.. తాగునీరు సైతం కూలీలు ఇంటివద్ద నుంచి తెచ్చుకోవాల్సిందే. ఎండాకాలం కూలీలు వడదెబ్బకు గురై ప్రాణాలు సైతం కోల్పోయే ప్రమాదం ఉంటుందని, తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

- అశ్వారావుపేట, మార్చి 13

- ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కరువు
- రోజురోజుకూ పెరుగుతున్న ఎండలు
- అవస్థలు పడుతున్న లక్షల మంది కూలీలు
- వడదెబ్బకు గురైతే ప్రాణాలకే ప్రమాదం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కనీస సౌకర్యాలు లేక కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజురోజుకూ ఎండల తీవ్రత పెరిగిపోతుండటంతో కూలీల్లో మరింత ఆందోళన వ్యక్తమవుతున్నది. వేసవి ప్రారంభంలోనే ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంతో ఎక్కడ వడదెబ్బకు గురవుతామోనన్న భయం వెంటాడుతున్నది. కనీసం నీడ కూడా లేక ఎండల్లోనే పనులు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. తాగటానికి నీరు, ప్రమాదవశాత్తు గాయమైతే ప్రథమ చికిత్సకు కిట్లు కూడా ఉండటం లేదు. వైద్యులు మాత్రం కనీస జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. లేకుంటే వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఉంటాయని హెచ్చరిస్తున్నారు. గతంలో ప్రభుత్వం కూలీలు సేద తీరటానికి నీడ కోసం టెంట్లు పంపిణీ చేసింది. వీటిని కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. అంతేకాకుండా 2016 నుంచి మెడికల్ కిట్ల పంపిణీని సైతం నిలిపివేసింది. ఆ మెడికల్ కిట్లలో దూది, అయోడిన్, బ్యాండేజ్, ఓఆర్ఆర్ ప్యాకెట్లు ఉండేవి. వీటిని కేంద్ర ప్రభుత్వం నిలిపివేయటంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### ‘ఉపాధి’కి పెరిగిన డిమాండ్

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద వ్యవసాయ భూమి లేని కూలీలకు రూ.12 వేలు ప్రకటించడంలో ఉపాధిహామీ పనులకు డిమాండ్ పెరిగింది. దీంతో కూలీల సంఖ్య క్రమేపీ పెరుగుతున్నది. అధికారులు మాత్రం పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నీడ లేక చెట్ల కిందనే కూలీలు సేద తీరుతున్నారు. నీరు ఇంటినుంచే తెచ్చుకుంటున్నారు. ఏమైనా ప్రమాదం జరిగి గాయాలైతే మాత్రం ప్రభుత్వ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు.

### జిల్లాలో 2.29 లక్షల మంది కూలీలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా 22 మండలాల్లోని 481 గ్రామ పంచాయతీల్లో 2.23 జాబ్ కార్డులు ఉన్నాయి. వీటిలో 4.58 లక్షల మంది కూలీలు నమోదై ఉన్నారు. కానీ యాక్టివ్ జాబ్‌కార్డులు 1.36 లక్షలు ఉండగా.. వీటి పరిధిలో 2.29 లక్షల మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. వీరిలో 11.62 శాతం మంది ఎస్సీలు, 61.12 శాతం ఎస్టీలు ఉన్నారు. ఎక్కువగా గిరిజనులే ఉపాధి పనులకు వెళ్తున్నారు. ప్రస్తుతం ఫాంపాండ్స్, మట్టి రోడ్డు, పశువుల షెడ్లు, నర్సరీ పనులు జరుగుతున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను 21వేల పనులు ప్రారంభించగా ఇప్పటివరకు 8,070 పనులు పూర్తయ్యాయి. మరో 13వేల పనులు కొనసాగుతున్నాయి. వీటిని ఈ నెలాఖరులోగా పూర్తిచేయాల్సి ఉంది.

### తాగునీరు కూడా ఉండదు..



ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. మేము పని చేసే చోట అధికారులు కనీసం తాగునీరు కూడా ఏర్పాటు చేయడం లేదు. మేమే ఇంటివద్ద నుంచి బాటిళ్లలో తీసుకెళ్తాం. అవి అయిపోతే ఇక అంతే సంగతి. చెట్ల కిందనే సేద తీరుతున్నాం. మెడికల్ కిట్లు లేకపోవడంతో ప్రమాదవశాత్తు ఎవరికైనా గాయాలైతే ఆసుపత్రికి పరుగుపెట్టాల్సిందే.

– బానోతు వీర్య, ఉపాధి కూలీ, చంద్రుగొండ

### వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది..



కనీస జాగ్రత్తలు తీసుకోకుంటే ఎండలతో వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంటుంది. అందుకే కూలీలు ఉదయం, సాయంత్రం వేళలో మాత్రమే పనులు చేసుకోవాలి. తలకు ఎండ తగలకుండా టవల్ చుట్టుకోవాలి. నీరు, నిమ్మరసం, మజ్జిగ లాంటివి ఎక్కువగా తీసుకోవాలి. వడదెబ్బకు గురైతే ప్రాణాప్రాయ పరిస్థితులు ఎదుర్కోక తప్పదు.

– డాక్టర్ కె.రాధా రుక్మిణి, ఆసుపత్రి సూపరింటెండెంట్, అశ్వారావుపేట

### మెడికల్ కిట్లు అందిస్తాం..



పని ప్రదేశాల్లో నీడ కోసం ఏర్పాటు చేసే టెంట్ల పంపిణీని ప్రభుత్వం ఎప్పుడో నిలిపివేసింది. తాగునీరు సరఫరా బాధ్యత గ్రామ పంచాయతీలకు అప్పగించింది. పని ప్రదేశాల్లో మెడికల్ కిట్లు అందుబాటులో ఉండేలా చూస్తాం. ప్రథమ చికిత్సకు అవసరమైన మెడికల్ సామగ్రిని ప్రభుత్వాసుపత్రుల నుంచి సేకరించి త్వరలోనే అందజేస్తాం. ఎండల నుంచి రక్షణ కోసం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూడా అందిస్తాం.

– రామచంద్రరావు, ఈజీఎస్ ఏపీవో, అశ్వారావుపేట

# యాసంగికి నీటి సమస్య రావొద్దు..

- సాగునీటిపై నిత్యం అధికారుల పర్యవేక్షణ ఉండాలి
- పాలేరులో అధికారులతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

కూసుమంచి, మార్చి 13 : యాసంగి పంటలకు ఎక్కడ కూడా నీటి సమస్య తలెత్తకుండా చూడాలని, సంబంధిత శాఖల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. పాలేరు రిజర్వాయర్‌ను గురువారం తనిఖీ చేసిన కలెక్టర్ నాలుగు శాఖల అధికారులతో మాట్లాడారు. రిజర్వాయర్ నీటి సామర్థ్యం, ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో, భక్త రామదాసు, పాలేరు పాత కాల్వ, మిషన్ భగీరథ గురించి అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ కరుణశ్రీ, డీఈ మధు, రత్నకుమారి, ఏడీఏ సరిత, ఏవో వాణిలతో మాట్లాడుతూ నీటి విషయంలో రోజువారీ పర్యవేక్షణ ఉండాలన్నారు. పాలేరు ఆయకట్టు పరిధిలో ఎక్కడైన నీటి సమస్య ఉందా? అని అడిగి తెలుసుకున్నారు. రూరల్ మండలం మంగళగూడెంలో నీటి సమస్య ఉందని, దానిని పరిష్కరిస్తామని ఏడీఏ సరిత తెలిపారు. భక్త రామదాసు కాల్వ నీటిని ఎవరూ మళ్లించకుండా అధికారులు, లష్కర్లు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఏలతో నిత్యం పరిశీలించాలన్నారు.

### గ్రామ, మండల, డివిజన్ కమిటీలు వేయండి..

యాసంగితోపాటు మళ్లీ వానకాలం పంటలు, నీటి పరిశీలన కోసం గ్రామాల్లో కార్యదర్శి, వీఆర్ఏ, లష్కర్‌లతో గ్రామ కమిటీలు, తహసీల్దార్, వ్యవసాయాధికారి, ఎస్సై, డీఈలతో మండల కమిటీలు, ఏడీఏ, ఈఈ, ఏసీపీలతో డివిజన్ కమిటీలు వేయాలని, ప్రతీ సోమవారం సమీక్ష జరగాలని కలెక్టర్ ఆదేశించారు. సాంకేతిక సమస్యలతో ఎక్కడైనా నీరు రాకుండా ఉందా? షట్టర్లు ఎక్కడైనా స్ట్రక్ అయ్యాయా? ప్రస్తుతం నీరు లేక ఎండుతున్న పంటలు ఉన్నాయా? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాలేరు ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో మధ్య వ్యత్యాసం 1,800 క్యూసెక్కులు ఉండడంతో రిజర్వాయర్ నీటిమట్టం క్రమంగా తగ్గుతుందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఎగువన సాగర్ మొదటి జోన్‌లో మరమ్మతు పనులు జరుగుతున్నందున తక్కువగా నీరు వస్తుందని, మరో నాలుగు రోజుల్లో 6 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందన్నారు. అలాగే నీటి నిల్వలు పెంచడానికి పొలాలు, చేలలో ఫాం పాండ్స్, వర్షపు నీటిని ఒడిసిపట్టేలా రైతులను ప్రోత్సహిస్తే బావులు, బోర్లలో నీటి సామర్థ్యం పెరుగుతుందని కలెక్టర్ సూచించారు.

# కొత్త అనుభూతి కలిగేలా మ్యూజియం

## భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్


అధికారులతో మాట్లాడుతున్న పీవో రాహుల్

భద్రాచలం, మార్చి 13 : ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా, చూడగానే కొత్త అనుభూతి కలిగే విధంగా గిరిజన మ్యూజియంను తీర్చిదిద్దాలని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియం పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మ్యూజియం పనులు 22వ తేదీలోగా పూర్తిచేసి శ్రీరామ నవమి నాటికి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. గిరిజనుల పాత కాలపు ఇంటి నిర్మాణం పూర్తిస్థాయిలో చేపట్టామని, కోయ కల్చర్‌కు సంబంధించి పెయింటింగ్ చిత్రాల పనులు చివరి దశకు వచ్చాయన్నారు. బాక్స్ క్రికెట్ గ్రౌండ్, బోటింగ్ చెరువు, ఆర్చరీ గ్రౌండ్ పనులు సోమవారం నాటికి పూర్తవుతాయన్నారు. మ్యూజియంను సందర్శించే పర్యాటకులు, భక్తులకు గిరిజన వంటకాలకు సంబంధించి స్టాల్స్ అందుబాటులో ఉంచుతామని, గిరిజన వంటకాలతోపాటు చైనీస్ ఫుడ్, కోయ కల్చర్ బొమ్మలు విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గిరిజన కల్చర్‌కు సంబంధించి ప్రతీ అంశం తెలుసుకునేలా.. చరిత్రను ప్రదర్శించేలా ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, ఈఈ చంద్రశేఖర్, ఉద్యానవనాధికారి ఉదయ్‌కుమార్, డీఈ హరీశ్, స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాలరావు, ఏఏస్‌వో నర్సింగరావు, ఏపీవో పవర్ వేణు, డీఏస్‌వో ప్రభాకర్‌రావు, ఈవో జీపీ శ్రీనివాసరావు, హెచ్‌వో చిట్టిబాబు, మ్యూజియం ఇంచార్జి వీరాస్వామి పాల్గొన్నారు.

Happy Holi
శ్రీరాం కిడ్నీ సెంటర్
యురాలజీ, ఇన్‌ఫెర్టిలిటీ, మెటర్నిటీ హాస్పిటల్
కావేరి హోటల్ వెనుక, బాలాజీనగర్, వైరా రోడ్, ఖమ్మం. ఫోన్: 08742-229727
హాస్పిటల్ ప్రత్యేకతలు
యూరాలజీ మూత్రపిండ మరియు మూత్రాశయ వ్యాధుల విభాగము
1. ఆపరేషన్ లేకుండా లేజర్ ప్రక్రియ ద్వారా కోత, కుట్లు లేకుండా మూత్ర పిండంలోని చిన్న రాళ్లను తీసివేయుట (1CM -1.5CM) (RIRS)
2. ఆపరేషన్ లేకుండా మూత్రపిండములోని రాళ్లను లితోట్రిప్సీ ద్వారా తీసివేయుట. (ESWL)
3. ఆపరేషన్ లేకుండా కీ హోల్ ద్వారా మూత్రపిండములోని రాళ్లను తీసివేయుట (PCNL)
4. మూత్రపిండము మరియు మూత్రనాళములోని (URETEO RENO SCOPY) రాళ్లను ఆపరేషన్ లేకుండా తీసివేయుట (లితోట్రిప్సీ)
5. మూత్ర నాళమును లైటు ద్వారా పరీక్షించి దానిలోని అడ్డంకులను తొలగించుట.
డా॥ కె.గురునాధరావు, M.S., M.Ch
యూరాలజిస్ట్, ఆండ్రాలజిస్ట్, మూత్ర అవయవ శస్త్ర చికిత్స నిపుణులు
• EHS • Health Insurance • పోలీస్ భద్రత పథకము.
ఆరోగ్యశ్రీ సదుపాయం కలదు.




ఖమ్మం జిల్లా మార్కెటింగ్ శాఖ పరిధిలోని ది బెస్టు వ్యవసాయ మార్కెట్లలో మద్దులపల్లి ఒకటి. దీని నుంచి ప్రతి సంవత్సరం పుష్కలంగా ఆదాయం మార్కెట్ ఖజానాకు చేరుతున్నది. కానీ ఈ వ్యవసాయ మార్కెట్ ఏ హోదాలో ఉంది అన్నది నేటివరకు తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 లేదా సెలక్షన్ గ్రేడ్ ఇలా కేవలం ఆదాయాన్ని బట్టి హోదా ఇవ్వడం ఆనవాయితీ. ఈ ఏడాది సైతం మద్దులపల్లి మార్కెట్ ఆదాయం రికార్డు స్థాయిలో రూ.3 కోట్లకు చేరే సూచనలు కనిపిస్తున్నాయి. కానీ ఇంతవరకు అధికారులు మద్దులపల్లి మార్కెట్‌కు హోదా ప్రకటించకపోవడం తీవ్ర నిర్లక్ష్యపు చర్యగా కనిపిస్తున్నది.

- ఖమ్మంరూరల్, మార్చి 13

- మద్దులపల్లి మార్కెట్‌పై అధికారుల తీవ్ర నిర్లక్ష్యం
- ఆరేళ్ల నుంచి లక్ష్యానికి మించి ఆదాయ సేకరణ
- ఇటీవల క్రయవిక్రయాలు సైతం ప్రారంభం
- హోదా దక్కితేనే పూర్తిస్థాయి అధికారి నియామకం
- ఖమ్మం ఏఎంసీ ఖజానాలోకి కోల్డ్‌స్టోరేజీల ఆదాయం

# ఆదాయం ఉంది.. హోదా లేదు!



ప్రైవేట్ ఇంట్లో నిర్వహణలో ఉన్న మార్కెట్ కార్యాలయం

అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని అన్నట్లు ఉంది ఖమ్మం జిల్లా రూరల్ మండలంలోని మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ తీరు. జిల్లాలో ఎనిమిదో మార్కెట్‌గా మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ ఆరేళ్ల క్రితం ఏర్పాటైంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ నుంచి 2018లో విడిపోయింది. ఈ మార్కెట్ పరిధిలో ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, కూసుమంచి మండలంలోని కొన్ని గ్రామాలు కలిపి మొత్తం 44 గ్రామాల సరిహద్దులో నాటి మార్కెటింగ్ శాఖ అధికారులు నోటిఫై చేశారు. మరుసటి ఏడాది 2019 నుంచి ఆదాయ టార్గెట్‌ను సైతం నిర్దేశించారు. ఒకే ఒక చెక్‌పోస్టు మరో నాలుగు జిన్నింగ్ మిల్లులు, రైస్ మిల్లులపైనే ఆధారపడిన మద్దులపల్లి మార్కెట్ కమిటీ సిబ్బంది నాటినుంచి నేటి వరకు తమవంతుగా శ్రమిస్తూ రాష్ట్ర మార్కెటింగ్ శాఖ నిర్దేశించిన దానికంటే అధికంగానే ఆదాయం సమకూర్చుతున్నారు. దీంతో గత కేసీఆర్ సర్కార్ కొత్త మార్కెట్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ రూ.19 కోట్ల నిధులను మంజూరు చేసింది. మార్కెట్ నిర్మాణ పనులు కొనసాగుతున్న తరుణంలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కొద్దినెలల తరువాత మార్కెట్ పునరుద్ధరణ పనులు జరిగాయి. ప్రస్తుతం నిర్మాణం పూర్తిదశకు చేరుకోవడంతో గత నెలలో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అధికారులు క్రయవిక్రయాలను లాంఛనంగా ప్రారంభించారు.

### పూర్తిస్థాయి అధికారి లేడు..

మార్కెట్‌కు హోదా ఇస్తే ఆ హోదాకు అనుగుణంగా అధికారిని ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. తద్వార మార్కెట్‌కు పూర్తిస్థాయి సెక్రటరీ అందుబాటులో ఉంటారు. కానీ ప్రస్తుతం ఖమ్మం వ్యవసాయ మార్కెట్ అసిస్టెంట్ సెక్రటరీనే ఇన్‌చార్జి సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. అతనితోపాటు మరో సూపర్‌వైజర్, ఇతర ఇద్దరు చిరుద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. దీంతో మార్కెట్ నిర్వహణ లోపభూయిష్టంగా జరుగుతున్నది అనే ఆరోపణలు మార్కెట్ వర్గాల్లో జోరుగా వినిపిస్తున్నాయి.

### కోల్డ్‌స్టోరేజీల ఆదాయం కలిస్తే మంచి హోదా

ప్రస్తుతం మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ఒక్కటి కాదు.. రెండు కాదు ఏకంగా 11 కోల్డ్‌స్టోరేజీలు అందుబాటులో ఉన్నాయి. అంటే దాదాపు 10 లక్షల మిర్చి బస్తాలను నిల్వ చేసుకునేందుకు అవకాశం ఉంది. ఏ మార్కెట్ పరిధిలో కోల్డ్‌స్టోరేజీలు, జిన్నింగ్ మిల్లులు ఉంటే వాటిద్వారా వచ్చే ఆదాయం ఆ ప్రాంత మార్కెట్‌లో కలిసే అవకాశం ఉంటుంది. కానీ మద్దులపల్లి మార్కెట్ పరిధిలో ఉన్న 11 కోల్డ్ స్టోరేజీల నుంచి వచ్చే కోట్లాది ఆదాయం ఆరేళ్ల నుంచి ఖమ్మం ఏఎంసీ పరిధిలోకి వెళ్తున్నది. దీంతో మద్దులపల్లి మార్కెట్ ఆదాయంపై తీవ్ర ప్రభావం పడుతున్నది. కోల్డ్‌స్టోరేజీల వద్ద జరిగే క్రయవిక్రయాల నుంచి వచ్చే ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకొని మార్కెట్‌కు హోదా కలిపిస్తే జిల్లాలోనే మంచి హోదా కలిగిన మార్కెట్‌గా మద్దులపల్లి మార్కెట్‌కు గుర్తింపు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ సంవత్సరం మార్కెట్ ఆదాయం సుమారుగా రూ.3 కోట్లు పైచిలుకు సాధించడంతో పాటు, కోల్డ్‌స్టోరేజీల ఆదాయం సైతం పరిగణనలోకి తీసుకొని హోదా ఇవ్వాలనే డిమాండ్ స్థానికుల నుంచి వినిపిస్తున్నది.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616